

# కృతి - ఆకృతి

## – అపర్ణ మునుకుట్ల గునుపూడి



07

ఈ శీర్షిక ఉద్దేశ్యం కర్ణాటక సాంప్రదాయ సంస్కృతాంధ్ర కృతులలో భాష, రాగ, భావములను ప్రస్తావించి, మీకు శ్రావ్యానుభూతి కోసం ఆ కృతిని కూడా జత పరిచి మీ కందించాలని. ఈ కృతులందరికి తెలిసినవే అయినా వాటి సాహిత్య, రాగ, భావ ప్రకటనలు తెలిసేక మళ్ళీ విన్నప్పుడు ఆ కృతియొక్క ఆకృతిలో మీకు మరొక కోణం కనిపించవచ్చునేమో అన్నదే మా ఆలోచన, ఈ చిన్ని ప్రయత్నం.

గమనిక: పల్లవి, అనుపల్లవి, చరణములు ఉండి, సంగీత ప్రాధాన్యత కలిగి పెక్కు సంగతులతో రాగసంచార, భావప్రస్తారమునకు వీలుగా, స్వరకల్పనలో పాండిత్య ప్రతిభను ప్రదర్శించు విధముగా ఉన్నటువంటివి కృతులు. పల్లవి, అనుపల్లవి, పెక్కు చరణములు కలిగి ఒకే పద్ధతిలో గానము చేయగలిగి, భావ ప్రాధాన్యత కలిగినటువంటివి కీర్తనలు.

కార్తీకమాసం శివుడికి విశిష్టం. ఆ సందర్భంగా ఈ నెల నుండి అయిదు నెలలు వరుసగా ముత్తుస్వామి దీక్షితుల వారి పంచభూత (భూమి, జల, అగ్ని, వాయు, గగనం) లింగ కృతుల మీద వ్యాఖ్యానం, ఆ క్షేత్రాల గురించి రాద్దామన్న నా సంకల్పానికి నాందిగా కాంచి క్షేత్రంలో ఉన్న పృథివీ లింగం మీద రచించిన చింతయ మా కంద మూలకందం కృతి.

గాత్రం: తనికెళ్ళ చంద్ర భాను

రచన: ముత్తుస్వామి దీక్షితులు

రాగం: భైరవి

తాళం: రూపక తాళం

పల్లవి: చింతయ మా కందమూల కందం చేతః శ్రీ సోమాస్కందం

Click here to Listen

అనుపల్లవి: సంతతం అఖండ సచ్చిదానందం సామ్రాజ్యప్రద చరణారవిందం

చరణం: మంగళకర మందహాస వదనం మాణిక్యమయ కాంచి సదనం

అంగ సౌందర్య విజిత మదనం అంతక సూదనం కుందరదనం

ఉత్తుంగ కమనీయ వృష తురంగం భైరవీ ప్రసంగం

గురుగుహాంతరంగం పృథివీలింగం

వాగ్గేయకారులైన త్రిమూర్తులలో ఒకరైన దీక్షితుల వారు తక్కిన ఇద్దరి కంటే కొంత ఎక్కువ దేశాటనం చేసినట్టు చెప్పుకుంటారు. అంతే కాకుండా వారు చూసిన ప్రతి క్షేత్రాన్నివర్ణిస్తూ రాసిన కృతులే దానికి నిదర్శనం. ఈ కృతి కంచిలో ఉన్న ఏకామ్రేశ్వరుడిని స్తుతిస్తూ రాసిన కృతి. పల్లవిలో మామిడి చెట్టు క్రింద వెలసిన శివుడిని తలుచుకోమని అంటూ అనుపల్లవిలో అతని పాద పద్మాలు నిత్య నిర్విరామ ఆనందాన్ని, సామ్రాజ్యాల్ని ప్రసాదిస్తాయి అంటారు . చరణంలో చక్కని అంత్య ప్రాసలతో, జాజి మొగ్గలవంటి పలువరుసతో, మంగళాన్ని చేకూర్చే చిరునవ్వులొలికే వదనంతో, మన్మధుడిని ఓడించే అంగ సౌష్టవంతో, ఎత్తైన అందమైన నందిని వాహనంగా చేసుకుని, అంతకుడు అంటే యముడిని ఓడింపజేస్తూ, కమనీయంగా భైరవి అంటే పార్వతితో ప్రసంగిస్తూ, పృధివి లింగంగా వెలసి, మాణిక్యమయమైన కాంచీపురాన్ని, గురుగుహ అంతరంగాన్ని సదనంగా చేసుకొన్నవాడు, అంటూ అతి మనోహరంగా వర్ణిస్తారు.

ఈ క్షేత్రం, అందులో పృథివీ లింగ ప్రాముఖ్యత: పార్వతి దేవి శివునికై తపస్సు చేయ సంకల్పించి కాంచీపురంలో ఒక మామిడి చెట్టు క్రింద తపస్సు చేయసాగింది. ఆ మావిడి చెట్టు నుంచి రోజుకి ఒక పండు రాలేదిట. ఆవిడ ఆ రాలిన ఒక్క పండు మాత్రం భుజించేదిట. అందరు తపస్సు చేసే వారు సాధారణంగా ఎదుర్కొనే పరీక్షలు, అంటే ఎండ వలన తీవ్రమైన వేడి, గాలి వాన వల్ల నీటి వత్తిడి వంటివి ఆవిడకీ వచ్చేయి. అయినా చలించకుండా అన్నిటిని తట్టుకుంటూ ఆవిడ తపస్సు కొనసాగించింది. ఎంతకీ ఈశ్వరుడు కనికరించడంలేదని తలుచుకుని, ఆవిడ ఆ చెట్టు మొదట్లో మట్టితో ఒక శివలింగాన్ని తయారు చేసి దానికి సకలోపచారాలతో పూజలు చేస్తూ కాలం గడిపేది. ఇది ఇలా ఉండగా ఆవిడకి ఉప్పెన లాంటి మరొక పరీక్ష ఎదురయ్యింది. పక్కనే ప్రవహిస్తున్న వేగవతి నదిలో నీరు పొంగి వరదలై పారసాగింది. ఆవిడ మనసా వాచా కర్మణా జపించే ఈశ్వరుడిని తలుచుకుంటూ, తాను రోజూ భక్తి శ్రద్ధలతో కొలుచుకునే లింగం వరదలో కొట్టుకుపోతుందేమోనన్న భయంతో ఆవిడ వెంటనే ఆ లింగాన్ని గట్టిగా కట్టుకుని, ఆ నీటి ప్రవాహానికి అడ్డంగా తాను నిలబడుతుంది. “అలంకార ప్రియో విష్ణు: అభిషేక ప్రియో శంకర:” అన్నట్టు “శివుడికి గంగ ఉదకము తెచ్చి నీకు లింగ పూజలు చేదమంటే” అన్నట్టు, నిజానికి లింగానికి అభిషేకం చేయడమే అతనికి పరమ ప్రీతి. కానీ ఇక్కడ పార్వతి తాను రోజూ పూజించే శివలింగం నీళ్ళల్లో కొట్టుకుపోకుండా దాచాలన్న నిశ్చల భక్తి ప్రపత్తులకి శివుడు కరిగి తక్షణమే సాక్షాత్కరించి ఆవిడని కనికరించి ఆవిడ కోసం అక్కడే స్థిరపడిపోయేడని అంటారు. పార్వతి అమాయకత్వం కానీ, నిజానికి శివుడి ఆజ్ఞ లేనిదే చీమైనా కదలదు అన్న నానుడి ప్రకారం ఆ శివలింగం గంగలో కలిసిపోయే ఆజ్ఞే అయితే ఆవిడ ప్రయత్నం ఫలించేదా? శత విధాలా ప్రయత్నం చేసినా, ఆవిడే కాదు ఎవ్వరు దాన్ని ఆపలేరు. కానీ జరిగినదానిని బట్టి ఈశ్వరుడు అక్కడ ఆ రూపంలో స్థిరపడాలని సంకల్పించేడు కనకే అల్లా జరిగిందని అనుకోవాలి. రోజుకి ఒక్క మావిడిపండు నిచ్చే ఆ చెట్టు దగ్గర వెలిసేడు కనక ఏకామ్రేశ్వరుడని పేరు తెచ్చుకున్నాడు. కట్టుకుంటే కరిగిపోయేవాడు కనకనే భోళా శంకరుడయ్యాడు. మట్టితో చేసిన లింగం వల్ల పృథివీ లింగం అయ్యేడు.

ఇప్పటికీ కంచిలో ఏకామ్రేశ్వరుడి ఆలయ ప్రాంగణంలో కొన్ని వందల సంవత్సరాలుగా పెరుగుతూ మహా వృక్షమైన ఒక మామిడి చెట్టు ఉందని ప్రతీతి. ఇక్కడ అన్ని ఆలయాల్లో లాగ పార్వతికి శివుని పక్కని కాకుండా, విడిగా ఇంకొక ఆలయం ఉంటుంది. అదే కంచి కామాక్షి ఆలయం. ఏకామ్రేశ్వరుడి ఆలయంలో ఉన్న మామిడి చెట్టు పళ్ళు కామాక్షి పేరుతో వెలిసిన పార్వతికి నైవేద్యం పెడతారని అంటారు.

ఈ కథలో ఇంకొక గమనించదగ్గ విషయం చెట్టు మూలంలో శివలింగం వెలవడం. అదీ ఉట్టి చెట్టు కాదు, రోజుకొక పండునిచ్చే చెట్టు. ఒక విత్తనం క్రింద పడి మొలకెత్తాలంటే దానికి సస్యవంతమైన క్షేత్రం కావాలి, అందులో ప్రధానమైన వస్తువు మట్టి. నారు పోసేకే నీరు అన్నట్టు మొదట విత్తనాన్ని నాటడం, ఆ తరవాతే నీరు పొయ్యడం జరుగుతుంది. పార్వతి ఏ విధంగా రోజుకొక ఫలాన్ని అందుకుందో, అలాగే మనందరికీ కూడా ఫలాల్నిచ్చే వృక్షం పెరగాలంటే అందుకు సుక్షేత్రం/మట్టి చాలా ముఖ్యం. దాని ప్రశస్థత చాటి చెప్పడానికే శివుడు పృథివిలింగం రూపంలో అక్కడ వెలిసేడేమో అనుకుంటే, మన చుట్టూ ఉన్న భూమి, క్షేత్రములు అన్ని శివ స్వరూపాలే అవుతాయి. అటువంటప్పుడు మనందరం కూడా భూమికి సకలోపచారాలు చేసి పూజించాలి. అయితే పార్వతి ఏ విధంగా ఆ పృథివీ లింగాన్ని కాపాడిందో అదే విధంగా ఈ భూమిని సుక్షేత్రంగా, సుభిక్షంగా ఉంచే బాధ్యత మనందరిమీదా ఉందనడమే శివసంకల్పమేమో?

దీక్షితుల వారి భైరవీ ప్రసంగం అన్నది చాలా ముచ్చటైన ప్రయోగం. ఏ పురాణం తీసుకున్నా అందులో పార్వతి పరమేశ్వరులు (భైరవీ, భైరవుడు) ప్రసన్నంగా ప్రసంగించుకున్నారని, అలాగే తీవ్రంగా వాదోపవాదాలు చేసుకున్నారన్న కథలు అనేకం. ఆ లక్షణాన్ని వివరిస్తూ వారు ఈ కృతిలో భైరవి రాగముద్ర వేస్తూ శివుడు పార్వతి ముచ్చటించుకుంటారని వేసిన భైరవీ ప్రసంగం అన్న అపూర్వమైన సమాసం విన్నప్పుడల్లా, వాళ్లిద్దరూ కూడా అందరు దంపతుల్లాగే ముచ్చటించుకుంటారని, వాళ్ళు ఏం ముచ్చట్లాడుకుంటున్నారో మనం కూడా వింటే ఎంత బాగుంటుందో అన్న భావనని కలిగించి పులకింపజేస్తుంది ఈ కృతి.

సంగీతం ఇదం పుణ్యం సంగీతం ఇదం సౌఖ్యం

సంగీతం ఆరోగ్యప్రదం సంగీతం శాంతియుతం

తనికెళ్ళ చంద్ర భాను కర్ణాటక సంగీతంలో ప్రావీణ్యత పొందిన ఏ. ఐ. ఆర్ కళాకారిణి. దుర్గాబాయి దేష్ముఖ్ సంగీత కళాశాలలో సంగీతాచార్యులుగా పని చేస్తున్నారు. దేశ విదేశాల్లోను, టీటీడీ, ఎస్ వి బి సి ఛానెల్ లోను విరివిగా కచేరిలు చేస్తుంటారు. ప్రస్తుతం బెంగళూరు నివాసస్తులు.

COMMENTS